నేడు ఎమ్మెల్సీగా దాసోజు ప్రమాణస్వీకారం

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన బీఆర్ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మధ్యాహ్నం 12:30 గంటలకు అసెంబ్లీ ప్రాంగణంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆయనతో ప్రమాణస్వీకారం చేయించనున్నారు. ఈ కార్యక్రమానికి మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, పద్మారావుగౌడ్ తదితరులు హాజరుకానున్నారు.

ప్రమాణాలు పాటిస్తేనే అఫిలియేషన్లు!

- నేటి నుంచి ఇంజినీరింగ్ కాలేజీల్లో తనిఖీలు
- కాలేజీలకు జేఎన్‌టీయూ అధికారుల హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) :అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ), యూనివర్సిటీ ప్రమాణాలు పాటించిన ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీలకు మాత్రమే అఫిలియేషన్లు(అనుబంధ కాలేజీలుగా) ఇచ్చేందుకు జేఎన్‌టీయూ అధికారులు సిద్ధమయ్యారు. విద్యా ప్రమాణాలు పాటించని కాలేజీలకు ఎట్టి పరిస్థితుల్లో అఫిలియేషన్లు ఇచ్చేది లేదని కళాశాలల యాజమాన్యాలను హెచ్చరిస్తున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అఫిలియేషన్ల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభంకానున్నది. రాష్ట్రవ్యాప్తంగా జేఎన్‌టీయూ పరిధిలోని మొత్తం 224 ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో 15 బృందాలు తనిఖీలు చేపట్టనున్నాయి. తనిఖీలకు మే మొదటి వారం వరకు గడువు ఇచ్చినట్టు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఆ తర్వాత నివేదికలను పరిశీలించి అఫిలియేషన్ల తుది జాబితా విడుదల చేయనున్నట్టు చెప్పారు.

వడ్డీలేని రుణాలపై జీవో ఏది?

- 20 లక్షల రుణాలు పచ్చి అబద్ధం
- అబద్ధాలతో నమ్మించే యత్నం
- హామీల అమల్లో కాంగ్రెస్ విఫలం
- మాజీ మంత్రి హరీశ్ మండిపాటు

> ఈ ప్రభుత్వం గతంలో మాదిరిగానే రూ.5 లక్షల వరకే వడ్డీలేని రుణాలిస్తున్నది వాస్తవం కాదా? నిజంతెలిసీ భట్టి విక్రమార్క అబద్ధాలెందుకు చెప్తున్నరు? అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు జీవో 29 ప్రకారం రూ.5 లక్షలేనని చెప్పింది వాస్తవం కాదా? రూ.20 లక్షల వరకు వడ్డీలేని రుణాలిస్తున్నది నిజమే అయితే ఆ జీవో బయటపెట్టు! లేదంటే అటు అసెంబ్లీలో, ఇటు బహిరంగసభల్లో అసత్యాలు చెప్పి మోసం చేసినందుకు క్షమాపణలు చెప్పు. –హరీశ్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తేతెలంగాణ): నాడు ఓట్ల కోసం అలవిగాని హామీలిచ్చిన కాంగ్రెస్ నేతలు, నేడు అలవోకగా అబద్ధాలు చెప్తూ ప్రజలను నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. హామీల అమల్లో విఫలమైన సర్కారు ఎంచుకున్న రాచమర్గం ఇదేనని, ఈ విషయంలో అధికార పార్టీ నాయకులందరిదీ అదే దారి అని మంగళవారం ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. మహిళలకు రూ.21 వేల కోట్ల వడ్డీలేని రుణాలపై ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మొన్న మంచిర్యాల సభలో మంచినీళ్లు తాగినంత సులువుగా అబద్ధాలు చెప్పారని ఉదహరించారు. 'అసత్యాలు చెప్పడం, మోసం చేయడం కాంగ్రెస్‌కే చెల్లింది. రూ.20 లక్షల వరకు వడ్డీలేని రుణాలిస్తున్నది నిజమే అయితే సంబంధిత జీవోను బయటపెట్టు' అని డిమాండ్ చేశారు. స్వయంగా ముఖ్యమంత్రి నిరుడు నవంబర్ 19న వరంగల్‌లో, మళ్లీ అవే చెక్కులను ఈ యేడు మార్చి 8న హైదరాబాద్‌లో ఇందిరా మహిళా శక్తి సభల్లో మహిళలకు ఇచ్చిన చెక్కులు ఇప్పటికీ చెల్లుబాటు కాకపోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. వెంటనే ఈ చెక్కులను క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. 'స్కూల్ యూనిఫాంల కుట్టుకూలి విషయంలో రూ.50 ఇచ్చి రూ.75 చొప్పున ఇస్తున్నామని ప్రచారం చేసుకున్నరు. మేం నిలదీసిన తర్వాత రూ.25 వేలు విడుదల చేశారు. ఈ నగదును వెంటనే చెల్లించాలి' అని కోరారు. స్కూల్ డ్రెస్‌లు కుట్టేందుకు విద్యార్థులు వెళ్లి కొలతలు ఇవ్వాలని షరతు విధించడాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వం ఇచ్చే రూ.75 కుట్టుకూలి ఏ మూలకూ సరిపోదని, రూ.150 చొప్పున ఇవ్వాలని సూచించారు. మహిళా సంఘాలకు రుణాలిచ్చే స్త్రీనిధి అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. మొత్తం లోన్లల్లో 40 శాతం నాన్ ఫర్ఫార్మింగ్ అసెట్స్ ఉండటం వల్ల ఈ స్కీం మనుగడ ప్రశ్నార్థకమైందని పేర్కొన్నారు. ఐఏఎస్ అధికారికి బాధ్యతలిచ్చి స్త్రీనిధి స్కీంను కాపాడాలని కోరారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని కోతలు కోసిన రేవంత్‌రెడ్డి ఏడాదిన్నర ఇందిరమ్మ పాలనలో ఎడతెగని వంచన చేశారని నిప్పులు చెరిగారు. కోటీశ్వరులేమోగాని, లక్షాధికారులను కూడా చేయడం చేతగాని సర్కారు ఇదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రచార యావను పక్కన బెట్టి మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మహిళలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

ఉపాధిహామీకి తూట్లు..

ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీవోలు, సీవోలకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకుండా ఉపాధిహామీ పథకానికి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడుస్తున్నదని హరీశ్ ధ్వజమెత్తారు. వేతనాలందక వారు పస్తులుంటుంటే ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. మంత్రులు, అధికారులను కలిసి గోడువెళ్లబోసుకున్నా ఎలాంటి ప్రయోజనం లేదని వారంతా ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. వారి వేతనాల చెల్లింపులోనూ సీఎం, మంత్రులు తలోమాట చెప్తున్నారని ఆక్షేపించారు. వేతనాలు పెండింగ్‌లో పెట్టి ప్రభుత్వాన్ని నడుపుతున్నామని నిస్సిగ్గుగా చెప్తున్న రేవంత్‌రెడ్డి..ఉపాధి కూలీల నగదును ఎవరి ఖాతాల్లోకి మళ్లిస్తున్నారో చెప్పాలని నిలదీశారు. నాడు ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఊదరగొట్టి ఇప్పుడు ఉన్న నౌకర్లను ఊడగొట్టేందుకు సిద్ధమయ్యారని దెప్పిపొడిచారు. వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పక్కన మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఎకరాకు పరిహారం 30 వేలివ్వాలి

- మొన్నటిదాకా నీరు లేక ఎండిన పంటలు.. నేడు వర్షాలతో పంటలు నీళ్లపాలు
- పరిహారమిచ్చి ఆదుకోవాలి
- భూభారతిలో అసైన్డ్, పోడు భూముల క్రయవిక్రయాలకు అవకాశం కల్పించాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- కాంగ్రెస్‌కు పుట్టగతులుండవ్: జైపాల్‌యాదవ్

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఏ విధంగా పంటలు నష్టపోయినా రైతాంగానికి ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్ మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో నీటి ఎద్దడితో పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మరికొన్ని ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వడగండ్ల వానలతో పండిన పంటలు నీళ్లపాలయ్యాయని తెలిపారు. పంట ఏ రకంగా నష్టపోయినా బాధిత రైతులకు పరిహారం ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో, రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకూ పరిహారం చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారంపై స్పందించకపోతే రైతులకు అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ కార్యాచరణ ప్రకటిస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తెచ్చిన భూభారతి చట్టంలో రైతులను నయవంచన చేశారని విమర్శించారు. అసైన్డ్, పోడు భూముల క్రయవిక్రయాలపై చట్టం తెస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని, చట్టంలో ప్రస్తావించనే లేదని తెలిపారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై కక్షతోనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నదని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకుండా, గోదావరిని ఎండబెట్టారని విమర్శించారు. దేవాదుల పంపును ఆన్ చేయకుండా నెలరోజులు ఆలస్యం చేయడంతోపాటు పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడంతో పంటలు ఎండిపోయాయని నిప్పులు చెరిగారు. నెట్టెంపాడు, జూరాల ఆయకట్టుకు కూడా సక్రమంగా నీళ్లివ్వలేదని, అందుకే ఆగ్రహించిన రైతులు అక్కడ ధర్నాకు దిగారని తెలిపారు.

కర్ణాటకలో అక్రమ ప్రాజెక్టులు.. ఏపీకి అదనపు జలాలు

కర్ణాటక పరిధిలో కృష్ణా నదిపై అక్రమంగా చేపట్టిన ప్రాజెక్టులపై తెలంగాణ ప్రభుత్వం స్పందించడం లేదని శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. ఏపీకి అక్రమంగా అదనపు కృష్ణా జలాలను తరలిస్తున్నా సర్కారులో స్పందనే కరువైందని ధ్వజమెత్తారు. తమ పర్యటనల్లో రైతులు గుండెలవిసేలా వారి బాధలు ఏకరువు పెట్టారని తెలిపారు. నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖ మంత్రులు ఏం చేస్తున్నారని నిలదీశారు. రాష్ట్రంలో 16 నెలల పాలనలో అక్రమ కేసులు, అరెస్టులు, నిర్బంధాలు, కక్ష రాజకీయాలతోనే కాంగ్రెస్ కాలం గడుపుతున్నదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో తాగునీటి ఎద్దడిపై ముందుచూపు లేదని, హైదరాబాద్‌లో తాగునీటి సమస్య పొంచి ఉన్నదన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. సీఎం, మంత్రుల మధ్య సమన్వయం కొరవడిందని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ దుయ్యబట్టారు. ప్రజలను ఇక్కట్ల పాల్జేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బంగాళా ఖాతంలో వేసినా తప్పులేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులను నిలువునా మోసగించిన ఈ ప్రభుత్వం మూటాముల్లె సర్దుకోవాల్సిందేనని హెచ్చరించారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు ఉండవని స్పష్టంచేశారు.

సర్కారును కూల్చాల్సిన అగత్యం లేదు

- ప్రజలే గద్దె దించాలని చూస్తున్నారు
- సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, వేదికపై మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్ తదితరులు

తిరుమలగిరి, ఏప్రిల్ 15 : రేవంత్ సర్కారును కూల్చాల్సిన అగత్యం బీఆర్ఎస్‌కు లేదని ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు కాంగ్రెస్ నుంచే అంతర్గతంగా జరుగుతున్నాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుమలగిరి మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా ప్రజలే రేవంత్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని చూస్తున్నారని తెలిపారు. రేవంత్ ప్రభుత్వం ఆర్థిక అరాచక పాలన సాగిస్తున్నదని దుయ్యబట్టారు. అంతకుముందు బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కోసం తుంగతుర్తి నియోజకవర్గ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లా వేదికగా జరిగే సభ చరిత్రను తిరగరాస్తుందని తెలిపారు. ప్రజల్లో తిరుగుబాటు మొదలైతే పోలీస్, మిలటరీ ఎవరూ ఆపలేరని హెచ్చరించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో అందిన ఫలాలనే ప్రజలు ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ గురుకులాలను కార్పొరేటుకు దీటుగా తీర్చిదిద్ది దేశంలోనే ఆదర్శంగా నిలిపారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి మాత్రం విద్యాశాఖకు మంత్రిగా ఉండి 90 మంది గురుకుల విద్యార్థుల చావుకు కారణమై దేశంలోనే రికార్డు నెలకొందని ఎద్దేవాచేశారు. కొల్పారని విమర్శించారు. సభలో మాట్లాడుతుండగానే కరెంట్ పోవడంతో.. రేవంత్‌రెడ్డి హయాంలో కరెంట్ పరిస్థితి ఇలా ఉందని పేర్కొనడంతో నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా నవ్వారు. రెప్పపాటు సమయం కూడా కరెంట్ పోకుండా కేసీఆర్ విద్యుత్తు అందిస్తే.. నేడు కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఎద్దేవాచేశారు.

ఒకే మార్కులు రావడం సహజం: టీజీపీఎస్సీ

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలపై ఆరోపణల నేపథ్యంలో టీజీపీఎస్సీ స్పందించింది. పరీక్షల్లో ఒకే మార్కులు రావడం సహజమని టీజీపీఎస్సీ కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెయిన్స్ జవాబుపత్రాలను వర్సిటీల్లో పనిచేస్తున్న రెగ్యులర్ ఫ్యాకల్టీతో మూల్యాంకనం చేయించినట్టు పునరుద్ఘాటించారు. కోఠి మహిళా కాలేజీ అభ్యర్థన మేరకు మహిళా అభ్యర్థులకు మాత్రమే పరీక్ష కేంద్రం కేటాయించామని తెలిపారు. మొత్తం అభ్యర్థుల్లో 25 శాతం 18, 19 నంబర్లు గల కేంద్రాల్లో పరీక్షలకు హాజరయ్యారని, ఎంపికలోనూ ఎక్కువ నిష్పత్తి వారే ఉన్నట్టు పేర్కొన్నారు. ప్రిలిమ్స్ హాల్‌టికెట్లలో జిల్లా కోడ్, సెంటర్ కోడ్ ఉండటంతోనే మెయిన్స్ పరీక్షలకు వేరే హాల్‌టికెట్ ఇచ్చినట్టు పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌రావు

కోనోకార్పస్ బహుళ ప్రయోజనకారి

- వాటితో ఎలాంటి చేటు జరగదు
- స్పీకర్ వ్యాఖ్యలు అశాస్త్రీయం
- మీడియా సమావేశంలో వక్తలు

ఖైరతాబాద్, ఏప్రిల్ 15: కోనోకార్పస్ వృక్షాలతో బహుళ ప్రయోజనాలు ఉన్నట్టు పలు పరిశోధన పత్రాలు స్పష్టం చేస్తున్నాయని వక్తలు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ మోహన్‌రావు మాట్లాడుతూ.. ప్రకృతిలో ఉన్న ఏ వృక్షం, జీవజాలం చేటు చేయదని పేర్కొన్నారు. కోనోకార్పస్ వృక్షాల వేర్లు విస్తరించి పైపులైన్లు, గోడలను దెబ్బతీస్తాయని, విషవాయులను విడుదల చేస్తాయన్న అపోహలు ప్రజల్లో ఉన్నాయని, వాస్తవానికి ఏ చెట్ల వేర్లయినా విస్తరిస్తే అలాంటి ఫలితాలే ఉంటాయని చెప్పారు. కోనోకార్పస్ వృక్షాలు వాయుకాలుష్యాన్ని తగ్గిస్తాయని, ఈ చెట్ల ద్వారా సమకూరే నూనె యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేయడంతోపాటు మధుమేహాన్ని, వివిధ రకాల ఇన్ఫెక్షన్లను తగ్గిస్తుందని వివరించారు. కోనోకార్పస్ చెట్లు ఆక్సిజన్‌ను పీల్చుకొని కార్బన్‌డయాక్సైడ్‌ను విడుదల చేస్తాయంటూ స్పీకర్ ప్రసాద్ కుమార్ ఇటీవల అశాస్త్రీయమైన వ్యాఖ్యలు చేశారని, అది కేవలం అపోహ మాత్రమేనని జన చైతన్య వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణరెడ్డి స్పష్టం చేశారు. నిజానికి ఆ చెట్లు అధికంగా కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకొని ఆక్సిజన్‌ను సైతం అధికంగా విడుదల చేస్తాయని పరిశోధనల్లో తేలినట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆ చెట్లను నరకడం మానుకోవాలని, లేకుంటే సుప్రీంకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం వేస్తామని హెచ్చరించారు. ప్రపంచంలో సగటున ప్రతి మనిషికి 421 మొక్కలు/చెట్లు ఉంటే.. భారత్‌లో ఆ సగటు 28 మాత్రమేనని ఆవేదన వ్యక్తం చేశారు. వృక్షాల వల్ల మానవాళికి కలిగే ప్రయోజనాలపై యోగి వేమన యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఏఆర్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్‌ను గణనీయంగా తగ్గించగలిగే వృక్షాల్లో కోనోకార్పస్ ఒకటని తెలిపారు.సమావేశంలో ప్రొఫెసర్ బీఎన్ రెడ్డి, విశ్రాంత అధ్యాపకులు గోపాలకృష్ణ, పీఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

2వ సారి విచారణకు క్రిశాంక్

- కంచ గచ్చిబౌలి భూముల వీడియోలు, ఫొటోల విషయంలో కేసు నమోదు
- 8 గంటలు కూర్చోబెట్టి ఒక్క ప్రశ్నా అడగలే
- విచారణ పేరుతో వేధిస్తున్నరు : మన్నె క్రిశాంక్
- ప్రధాని మాట్లాడిండు.. కేసు పెడతరా? అని ప్రశ్న



పోలీసుల విచారణ అనంతరం బయటకు వస్తున్న మన్నె క్రిశాంక్

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 15: కంచ గచ్చిబౌలి భూముల వీడియోలు, ఫొటోల విషయంలో నమోదైన కేసులో బీఆర్ఎస్ నాయకుడు, సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ రెండోసారి గచ్చిబౌలి పోలీసుల విచారణకు హాజరయ్యారు. మంగళవారం ఉదయం 12 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విచారణ కొనసాగింది. అనంతరం బయటకు వచ్చిన క్రిశాంక్ మీడియాతో మాట్లాడుతూ విచారణ పేరిట ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతున్నదని వాపోయారు. మొదటిసారి విచారణలో 60 ప్రశ్నలు అడిగిన పోలీసులు.. రెండోసారి 8 గంటల పాటు పోలీసు స్టేషన్‌లో కూర్చోబెట్టి ఒక్క ప్రశ్న కూడా అడగలేదని చెప్పారు. ఓ విచారణాధికారి సెలవు మీద ఉండగా, ఒకరు ఢిల్లీకి వెళ్లారని, మరొకరు అందుబాటులో లేరని తెలిసిందన్నారు. ఓ వైపు రాష్ట్రంలో ఎన్నో ముఖ్యమైన సమస్యలు ఉండగా, పోలీసులు విచారణ పేరుతో సమయాన్ని వృథా చేస్తున్నారని విమర్శించారు. గ్రూప్-1లో పక్కపక్కన కూర్చున్న 684 మంది అభ్యర్థులకు సేమ్ మార్కులు వచ్చాయని, ఒకరి తర్వాత ఒకరు కూర్చున్న 702 మంది అభ్యర్థులకు ఒకే మార్కులు వచ్చాయని, అసలైన విచారణ వాటిమీద చేయాలని డిమాండ్ చేశారు.

ప్రధానిని కూడా పిలుస్తరా?

'కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్‌సీయూ భూముల్లో బుల్డోజర్లతో బిజీగా ఉన్నదని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సైతం మాట్లాడారు. మరి ప్రధాని మీద కూడా కేసుపెట్టి విచారణకు పిలుస్తారా?' అని క్రిశాంక్ ప్రశ్నించారు. ఈ నెల18న 3వ సారి విచారణకు రావాలని నోటీసు జారీ చేశారని, వీకెండ్ అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చాలా ఇష్టంలా ఉన్నదని, ఇండ్లు కూల్చాలన్నా, చెట్లు నరకాలన్నా వీకెండ్‌లోనే చేస్తున్నదని ఎద్దేవాచేశారు. వరుస కోర్టు సెలవులను చూసుకుని విచారణకు పిలుస్తున్నారని, అయినా బెదిరే ప్రసక్తే లేదని, చట్ట పరంగా విచారణకు హాజరవుతానని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం విచారణలో సెల్‌ఫోన్లు వాడడం చట్టవిరుద్ధమని తెలిసినా ఫోన్లు వాడుతున్నారని, సెలవుల్లో, వీకెండ్‌లో విచారణ పేరుతో ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా సోషల్ మీడియాలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడాన్ని మాత్రం ఆపే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

అధ్యాపకుల ఉద్యమం ఉధృతం

- నేడు ఇందిరాపార్కు వద్ద మహాధర్నా
- 19 నుంచి వర్సిటీల్లో నిరవధిక సమ్మె
- యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలకు చెందిన కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు. తమ పోస్టులను క్రమబద్ధీకరించాలన్న డిమాండ్‌తో బుధవారం ఇందిరాపార్కు వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చినట్టు తెలంగాణ స్టేట్ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్(టీజీయూసీటీఏ) రాష్ట్ర నాయకులు ధర్మతేజ, పరశురాం మంగళవారం ప్రకటించారు. బీఆర్ఎస్ తరపున మాజీ మంత్రి హరీశ్‌రావు, బీజేపీ నుంచి ఈటల, సీపీఐ నుంచి కూనంనేని, సీపీఎం నుంచి జాన్‌వెస్లీ, ఆర్ కృష్ణయ్య, ప్రొఫెసర్ హరగోపాల్, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ధర్నాలో పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ నెల 19 నుంచి వర్సిటీల్లో నిరవధిక సమ్మెను ఆయా యూనివర్సిటీ వీసీల దృష్టికి తీసుకెళ్లినట్టు జేఏసీ తెలిపింది. యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం జీవో 21 విడుదల చేసిన నేపథ్యంలో తాము నిరసనలకు దిగినట్టు కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ నాయకులు స్పష్టంచేస్తున్నారు. యూనివర్సిటీల్లో నియామకాలకు తాము వ్యతిరేకం కాదంటూనే, తొలుత తమ పోస్టులకు న్యాయం చేసిన తర్వాతే వాటిని చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా నాగనూలు కస్తూర్బా ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థినులు

రూ.500కే గ్యాస్‌కు మంగళం?

మూన్నాళ్ల ముచ్చటగా గ్యారెంటీ స్కీం

6 నెలలుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమకాని సబ్సిడీ పైసలు

గ్యాస్ ఏజెన్సీలు, ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న మహిళలు

పెద్దపల్లి జిల్లా ఓదెలలో గత ఆదివారం ఉపాధి పనులకు వెళ్లి నెత్తిన కట్టెల మోపుతో ఇంటికి తిరిగి వెళ్తున్న మహిళలు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): ఆరు గ్యారెంటీల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆరు నెలలుగా లబ్ధిదారుల ఖాతాల్లో రాయితీ డబ్బులు జమకావడం లేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు.. గ్యాస్ ఏజెన్సీలు, మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అధికారులను అడిగితే తమకేమీ తెలియదని చెప్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రభుత్వం 2024 ఫిబ్రవరి 27న రూ.500కే సిలిండర్ పథకానికి శ్రీకారం చుట్టింది. తెల్ల రేషన్‌కార్డులు ఉన్నవారందరికీ వర్తింపజేస్తామని ఘనంగా ప్రకటించింది. మహిళల పేరిట ఉన్న కనెక్షన్లకు మాత్రమే పథకం వర్తిస్తుందని చెప్పడంతో సుమారు 58 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో నిబంధల పేరిట సుమారు 13.9 లక్షల మందిని తొలగించి 44.1 లక్షల మందిని అర్హులుగా తేల్చారు. తొలుత రెండు, మూడు నెలలపాటు ఆయిల్ కంపెనీలకు రాయితీ డబ్బులు ఇస్తామని, తర్వాత నేరుగా అర్హుల ఖాతాల్లోనే జమ చేస్తామని చెప్పారు. ఆరేడు నెలలపాటు సక్రమంగానే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రాయితీ డబ్బులను జమచేశారు. అయితే, గత సంవత్సరం నవంబర్ నుంచి గ్యాస్ సబ్సిడీ నగదు అందడంలేదని మహిళలు వాపోతున్నారు. గ్యాస్ ఏజెన్సీలు, ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ కట్టెల పొయ్యే దిక్కు

నిత్యావసర సరుకుల ధరలు భగ్గుమంటుండటం, సబ్సిడీ గ్యాస్ స్కీం నిలిచిపోవడంతో పలువురు గ్రామీణ మహిళలు గ్యాస్ సిలిండర్‌ను అటకెక్కిస్తున్నారు. వంట కోసం కట్టెల పొయ్యిపై ఆధారపడుతున్నారు. ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ రూ.500కే సిలిండర్ ఇస్తామని అబద్ధాలు చెప్పిందని మండిపడుతున్నారు. గద్దెనెక్కిన తర్వాత ఖజానాలో డబ్బులు లేవని చెప్పి తప్పించుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ఒక్కసారే రూ.300 జమయినయ్

ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తుందని చెప్తే మస్తు సంతోషపడ్డం. ఈ ఏడాదిలో నాలుగు సిలిండర్లు తీసుకున్నం. కానీ, మొదటిసారి మాత్రమే సబ్సిడీ కింద రూ.300 మా ఖాతాలో జమైనయ్. ఆ తరువాత పడలేదు. మండల కేంద్రంలో ఉన్న గ్యాస్ ఆఫీసుకు పోయి అడిగితే మండలాఫీసుకు వెళ్లమన్నరు. అక్కడికి పోయి అడిగితే మాకు తెల్వదు అంటున్నరు. ప్రభుత్వం గిట్ల జేయడం మంచిపద్ధతి కాదు. ఇచ్చిన మాట ప్రకారం రూ.500కే సిలిండర్ ఇవ్వాలె.

- మద్దెల స్వప్న, కోలనూరు గ్రామం, ఓదెల మండలం, పెద్దపల్లి జిల్లా

మోసం చేస్తే తడాఖా చూపెడుతం